◆ ఈ వారం కథ

# చీమలు పెట్టిన పుట్టలు...

— తెలగరెడ్డి పుల్లయ్య

"బిజీగా ఉన్నారనుకుంటాను."

'సీరియస్ టెలిగ్రాం'ని సీరియస్‌గా టెలీప్రింటర్‌పై కొడ్తున్న నేను తలెత్తాను.

శివరావు పలకరింపుగా నవ్వి,

"యమర్జన్సీ డిపార్ట్‌మెంటుగాబట్టి మనమెప్పుడూ బిజీనే" అన్నాను, అతని చేతిలో కనిపిస్తున్న కాగితాన్ని చూస్తూ.

ఒకే ఆఫీసులోనే పనేస్తున్నా, అతన్తో స్నేహం లాంటిదేమీ లేదు నాకు. ఆఫీసు 'పెద్దమనుషుల్లో' అతనూ ఒకడు. 'ఒకే రకం ఈకలు గల పక్షులు ఒక్కచోట చేర్తాయ'ని కదా నానుడి!

ఆ కాగితాన్ని నా చేతిలో పెట్టాడు పక్క కుర్చీలో కూర్చుంటూ. సంతకాలూ, ఎదురుగా చందాలూ — చూడగానే అర్థమయింది నాకు. రిటైర్‌మెంట్లూ, ట్రాన్సఫర్లూ సందర్భంగా ఇచ్చే పార్టీలకు అది మామూలే. అయితే దాన్ని మా ఆఫీసు రిక్రియేషన్ క్లబ్బు ఏర్పాటుచేస్తుంది. అవసరమైనప్పుడు వసూళ్లు చేస్తుంది మెంబర్ల దగ్గర. 'మరి ఈయన చేయడమేమిటి?' అని ఆశ్చర్యపోతూ — పైన రాసిన వివరాల మీదకు దృష్టి మళ్లించాను.

ఆఫీసులో అటెండరుగా చేస్తున్న రాఘవరావు భార్య కాన్సర్‌తో బాధపడ్తున్నది. కొన్ని వేలవుతాయి ట్రీట్‌మెంటుకి. ఈ చిరుద్యోగికి అది శక్తికిమించిన పని. కాబట్టి తలా కాస్త సాయం చేయాలి. అదీ తాత్పర్యం.

"డిపార్ట్‌మెంట్ ఇవ్వదా?" అడిగాను.

నవ్వాడు హేళనగా.


"మన డిపార్ట్‌మెంటు ఇచ్చేది అతి కొద్ది. దానికెన్నో రూల్సు, రెగ్యులేషన్స్. ఈ లోపల పేషెంటు ఇంతే సంగతులు" అన్నాడు.

లిస్టు మరోసారి చూశాను. అందులో అన్నీ పాతికలున్నాయి. ఆశ్చర్యంగా శివరావయితే ఏకంగా రెండు వందలు వేశాడు! అతడు పెద్ద రేట్లకు వడ్డీలకిస్తాడని నాకు తెల్సు, నేవతని 'కష్టమర్ని' కాకపోయినా. అతని మీద సదభిప్రాయం కూడా లేదు నాకు. పైవాళ్లకు పాదాభివందనాలు, కింద వాళ్ళని చీదరింపులూ చేసే మనిషి. "అయితే శివరావులో నాకు తెలియని రెండో మనిషున్నాడన్నమాట. ఏ మనిషినీ అంత తేలిగ్గా బేరీజు వేయడం పొరబాటేనేమో!" అనుకున్నాను.

అయితే ఇప్పుడేమిటి చేయడం?

బాధల్లో వున్న రాఘవరావు మీద నాకు సానుభూతైతే వున్నది. కాని నా ఆర్థిక పరిస్థితే అంత సంతృప్తికరంగా లేదు.

"అప్పులు మన జీవితమంతా వుంటాయి కాని, చెప్పులు కొనుక్కోండి" అంటుంది మా శ్రీమతి ప్రతి ఫస్టుకి. కాళ్లకుంటే కనపడవుగాని, నలుగురిలో ఎక్కడన్నా విడవాల్సొస్తే ఇబ్బందిగా



వుంటువున్నది నాకు. అన్ని రిపేర్లున్నాయి వాటికి!

నిజానికి ఖర్చులు అంతకు మించే చేస్తున్నాను. వడ్డీలే వందల్లో కడ్తున్నాను. పిల్లల చదువులకు కొన్ని వేలు వెచ్చిస్తున్నాను. అయితే అత్యవసరాలకు మాత్రమే ముందు కేటాయింపులు.

'కోరికలు అపరిమితం - డబ్బు పరిమితం' కదా!

కాగితాన్ని అతనికిచ్చేస్తూ,

''తర్వాత వేస్తాన్లెండి'' అన్నాను.

''ఏం'' అన్నాడు. అప్పుడే అతని గొంతులో సౌమ్యత లోపించింది.

''నేను పది వేస్తాననుకోండి — ఎందుకంటే అంతకు మించి వేయలేను గనుక. ఇహ అందరూ పదే వేస్తారు. అందువల్ల పాపం అతనికి నష్టం'' అన్నాను.

''అలాగంటే ఎలా? మనతో పనిచేస్తున్న నాల్గో తరగతి సోదరుడికి ఆ మాత్రం సాయం చేయలేక పోతే ఎలాగండి. అయినా కన్నీటి కథలు రాసే మీకు నేను చెప్పగలిగినవాణ్ణా!'' వ్యంగ్యంగా అన్నాడు, తెలివిగా ఎత్తిపొడిచాడు.

అప్పుడప్పుడూ నేను కథలు రాసే మాట నిజమే. అందునా బడుగు వర్గాల గురించి రాసేదీ యథార్థమే. తెలియని విషయాల్ని తెలిసినట్లుగా రాయలేను కాబట్టి, నాకు తెల్సిన నాలాంటి సగటు మనుషుల గురించే రాస్తాను. కాని నా ఆర్థిక పరిస్థితి పైకి కనిపించేంత ఆరోగ్యకరంగా లేదు. అది అతనికి తెలియదు.

''అంతేలెండి. మాటల్లో పెద్ద పెద్ద నీతి కథలు చెప్తాం. మన ఆఫీసులోని మనిషికే సాయం చేయలేకపోతే, ఇంకెవరికి చేస్తాం. ఒక సినిమాకు ఫ్యామిలీతో వెళ్తే పాతికవుతాయి'' అని కుర్చీలో నుండి కొద్దిగా విసురుగా లేచాడు.

నేను ఫ్యామిలీతో సినిమాకెళ్లి కొన్ని నెలలయిందని చెప్పినా అతను నమ్మడు. నన్ను గురించి నలుగురిలో కించపరుస్తూ మాట్లాడే ప్రమాదముందని భయపడ్డాను. బాధల్లో వున్న తోటివాడికి సహాయం చేసిన సంతృప్తి వుంటుంది. మళ్లీ మాట్లాడకుండా ఇరవై అయిదూ వేశాను సంతకం పెట్టి.

''థాంక్సండీ. మీరు మనసుకలవాళ్ళని నాకు తెలుసు'' అంటూ మరో సీటు దగ్గరి కెళ్లాడు.

పని మంచిదయినా, అది నిర్విఘ్నంగా నెరవేరాలంటే ఇలాంటివాళ్లే పూనుకోవాలి. నాబోటివాడు ప్రారంభిస్తే — వేయకల్గినవాళ్లు సహితం తెలిగ్గా తప్పించుకోగలరు, ఏవో కారణాలు చెప్పి.

మళ్లీ టెలిగ్రాంలు కొడ్తూ ఆలోచన్లో పడ్డాను. చాలీచాలని జీతాల్తో బ్రతకడానికే బాధలు పడ్తుంటే — పాపం ఇలాంటి జబ్బులు కూడా తోడైతే వాళ్ల గతేమిటి? సానుభూతి వున్నా ఎవరైనా ఎంతవరకు సహాయం అందించగలరు. ఎవరి బాధలు వాళ్లకున్నాయి గదా.

జీతం తీసుకున్న రోజునే, గేటు దగ్గర కాపలా వేసిన శివరావుకి ఇరవై అయిదు ఇచ్చేశాను.

''మొత్తం ఎంత వసూలయిందేమిటి?'' అడిగాను.

''రెండు వేల వరకూ వచ్చిందండీ. ఇంకా తప్పుకుపోయిన బాపతు రెండు వందల వరకూ రావాలి'' అన్నాడు.

''ట్రీట్‌మెంట్‌కి ఎప్పుడు తీసుకెళ్తాడంట?'' అడిగాను.


''డబ్బు వసూలు చేసి ఇవ్వడం వరకే మన డ్యూటీ. ఇక అతనే చూసుకుంటాడు మిగతా కార్యక్రమాలన్నీ. అయినా ఈ డబ్బు ఏ మూలకి. అతడు మిగతా సొమ్ము ఎక్కడయినా పుట్టించాలి గదా'' అన్నాడు హడావుడిగా వెళ్లిపోతూ.

'మీరే అప్పుగా సర్దవచ్చు కదా' అనబోయి మానుకున్నాను. ఇప్పటికే రెండు వందలు ఉచితంగా ఇచ్చాడు కదా!

వరసగా రెండ్రోజులు వర్షంలో తడిసేసరికి జలుబు చేసింది. దాంతో తలనొప్పి పట్టుకుంది. జ్వరం తగిలినట్లుగా కూడా వుంది. 'కోల్డారిన్' లాంటిది వేసుకుని ఊరుకుందామనుకున్నాను కాని, మా ఆవిడ ఊరుకోలేదు. "డ్యూటీ ఆఫే గదా. డిస్పెన్సరీకి వెళ్లండి'' అని పోరు పెట్టింది. నా ఆరోగ్యం మా ఆవిడ మహాభాగ్యం కదా!

సీజన్ ప్రభావం అనుకుంటాను, జనం బాగా వున్నారు మా తంతి తపాలా డిస్పెన్సరీలో. నంబరు టోకెను తీసుకుని బెంచీ మీద కూలబడ్డాను విసుక్కుంటూ.

''మన విజయవాడకి వేసవికాలమే బెస్టు సీజనండీ'' ఎర్రగా, బొద్దుగా వున్న, నా ప్రక్కన కూర్చున్న మనిషి అన్నాడు. అతన్ని హెడ్ పోస్టాఫీసులో చూసిన గుర్తు.



"అవునండి" ఒప్పుకున్నాను వెంటనే.

"వర్షాలు మొదలయ్యాయంటే ఇహ జబ్బుల సీజను మొదలయినట్లే" అన్నాడు.

చిరునవ్వు నవ్వాను.

"నలభై అయిదు దాటాక బి.పి. కామనై పోయిందండీ. బి.పి. లేని వాళ్ళు కనపడటం లేదు ఈ రోజుల్లో" అన్నాడు మళ్ళీ.

"నిజమే" అదీ ఒప్పుకున్నాను, ఖండించే ఓపిక లేక.

అయితే అతడు అంతటితో సంతృప్తిపడి ఆగి పోలేదు.

"సహజంగా ఆ వయస్సులో బాధ్యతలు పెరుగుతాయి. మగపిల్లల చదువులు, ఆడపిల్లల పెళ్ళిళ్ళు లాంటివి. అంచేత ఆందోళన. అందుకే బి.పి." అంటూ వివరించాడు మళ్ళీ.

"ఇంతకీ మీరు బి.పి. చెకింగ్‌కేనా వచ్చింది" అనుమానం వచ్చినట్లుంది, తన వాగ్ధాటిని ఆపి అడిగాడు.

"నా కింకా బి.పి. రాలేదండి" అన్నాను — లోకరీతికి భిన్నంగా నడుస్తున్నందుకు కొద్దిగా సిగ్గుపడ్తూ.

'బాధ్యతల్ని తప్పించుకు తిరుగుతున్న మనిషి'ని చూసినట్లు చూసి, "ఎందుకైనా మంచిది చెక్ చేయించండోసారి. నేనూ ఇలాగే అశ్రద్ధ చేసి..." తన ధోరణిలో ఆయన సలహా ఇస్తున్నాడు ఇంకా.

అప్పుడే నన్ను రక్షిస్తున్నట్లు రాఘవరావు వచ్చాడు, భార్యను నడిపించుకుంటూ.

ప్రాణంతో వున్న అస్థిపంజరంలా వుందామె. నన్ను చూసి రాఘవరావు నమస్తే చెప్పాడు. పేషెంట్లు కూర్చునే బల్లలన్నీ నిండిపోయి వున్నాయి. నేను లేవాను — ఆమెను కూర్చో పెట్టమని. అందులో ఉదారత ఒక్కటే కాదు, పక్క 'సుత్తి దెబ్బలు' తప్పించుకుందామని కూడా.

ఆమె కూర్చుని ఏదో గొణుక్కుంటున్నది. రాఘవరావు ఏదో సర్ది చెప్తున్నాడు. నన్ను చూస్తూ, "చూడండి సార్. ప్రైవేటు డాక్టరు దగ్గర కెళ్దామంటుంది. వెళ్తే పరీక్ష ఫీజే యాభై అవుతుంది. మన డాక్టర్ల మీద, ఇక్కడ మందుల మీద ఆమెకు నమ్మకం లేదు" అన్నాడు.

"మన డాక్టర్లు బాగానే చూస్తున్నారుగా" అన్నాను.

"అదే సార్ నే చెప్పేది. వినదు. ఫ్రీగా వస్తున్నాయని చులకన. ఏం చావను" అన్నాడు విసుగ్గా.

ఆమె ఇంకా సణుక్కుంటూనే వున్నది. మాట మాత్రం వినబడడం లేదు.

"అవునూ, కాన్సర్ ట్రీట్‌మెంటుకి తీసుకెళ్ళే ప్రయత్నం ఎంతవరకూ వచ్చింది?" గుర్తొచ్చి అడిగాను.

ఒక్క క్షణం అర్థంగానట్లు చూశాడు.

"ఇంకా ప్రయత్నిస్తున్నాను సార్. డబ్బు దొరకడం మహా కష్టంగా వుంది" అన్నాడు తర్వాత.

వాళ్లావిడ మా సంభాషణ విని, మళ్లీ ఏదో గొణిగింది. పాపం అనారోగ్యంతో ఆమెకు గొణగడం అలవాటైపోయి వుంటుంది — మాట్లాడే ఓపిక లేక.

"ఆ ముందు వాళ్లని బతిమిలాడి వెళ్తాను సార్, ఈమె కూర్చోలేకపోతున్నది" అన్నాడు ముందుకు వెళ్తూ.

"నిజమే వెళ్లు" అన్నాను.

ఆమె సంగతి సరే, ఆమెతో రాఘవరావు ఎంత ఇబ్బంది పడుతున్నాడో!

ఆ తర్వాత ఒక రోజు నైట్ డ్యూటీలో రాఘవరావుని చూసి, అతని పరిస్థితులు గుర్తొచ్చి నిట్టూర్చాను. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని పెద్ద లెందుకు చెప్పారో మననం చేసుకున్నాను. శాప గ్రస్థులు అంటే ఇలాంటి వాళ్లేనేమో. అలిసిపోయి ఇంటికొస్తే, చిరునవ్వుతో ఎదురొచ్చే భార్య వుండటం ఎంత అదృష్టం! ఎన్ని వడ్డీలు కడ్తేనేం గాక, ఎన్ని ఆర్థిక బాధలుంటేనేం గాక.

"ఆర్థిక బాధ లెన్నయినా భరించగలం గానీండి, ఇంట్లో అనారోగ్యాలతో బాధలు భరించ లేమండి" అన్నాను పక్కనే పనిచేస్తున్న కృష్ణా రావుతో.

"ఆరోగ్యం పోతే జీవితంలో కొంత పోయి నట్లే!" ఇంగ్లీషు సూక్తిని, సమయానుకూలంగా ఉటంకించాడు కృష్ణారావు.

"బాగా చెప్పారు" అన్నాను.

"కాని ఆర్థిక బాధలు ఎదుర్కోడం కూడా కష్టమేలెండి. రెండు పూటలా తిండి లేనివాడు — డబ్బుకి మించింది మరేదో ఉందంటేససే మిరా ఒప్పుకోడు" అన్నాడు మళ్లీ.

తల ఊపాను.

"అందుకే ఆరోగ్యాన్ని - డబ్బుని కూడా జాగ్రత్తగా కాపాడుకోవాలి. లేకపోతే జీవితంలో ఇహ మిగిలేవి బాధలే."

జీవితాన్ని చదివినట్లు చెప్పాడు.

"కళ్లు మూసుకుని ప్రవర్తిస్తే వాడి పరిస్థితి అధోగతే. చూడండి ఆ రాఘవరావునే. ఎంతో దర్జాగా బతికాడు. రోజుకి రెండు సార్లు బట్టలు మార్చేవాడు. పూలరంగడిలా వెలిగాడు. అతని చుట్టూ పది మంది వుండేవాళ్లు ఎప్పుడూ. ఈనాటి పరిస్థితేమిటి? ఇల్లు గుల్ల - ఒళ్లు గుల్ల. చుట్టూ అప్పులూ - బాధలూ-" ఉదాహరణగా చూపించాడు.

"నిజమే. పాపం చివరికి వాళ్లావిడకు సరైన ట్రీట్‌మెంటు కూడా ఇప్పించుకోలేని పరిస్థితి" అన్నాను.

"చందాలు కూడా వసూలు చేశారంటగా.


అమెరికా సంబంధం



డాక్టర్ కొత్త రవీంద్రబాబు

సరికొత్త సీరియల్ త్వరలో!..

